# యాదగిరిగుట్టలో వైభవంగా కల్యాణోత్సవం


లక్ష్మీనరసింహుల జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 2 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహుల నిత్య తిరు కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లకు గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. గంటన్నర పాటు సాగిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలను అర్చకులు తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, తిరువారాధనలు, నిజాభిషేకం నిర్వహించిన అర్చకులు తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు. సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనం, అమ్మవారిని తిరుచ్చి వాహనం పై వేంచేపు చేసి వెండి మొక్కుజోడు సేవ కొనసాగించారు. దర్బార్ సేవలో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి వేంచేపు చేశారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతిపజేస్తారు. అనంతరం స్వామివారిని గర్భాలయానికి వేంచేపు చేశారు. ముఖ మండపంలో సువర్ణమూర్తులకు బంగారు పుష్పార్చనలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా బంగారంతో తయారు చేసిన 108పుష్పాలను శ్రీవారి సన్నిధిలో ఉంచి వాటితో అర్చన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా నిర్వహించిన సువర్ణ పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో స్వామి వారి నిత్యోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని శ్రీవారి ఖజానాకు రూ.29,81,252 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

# బీఆర్ఎస్ గెలుపులో బూత్ ఇన్‌చార్జీలదే కీలకపాత్ర

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి
- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త చెరుకు సుధాకర్

నకిరేకల్, నవంబర్ 2 : బీఆర్ఎస్ గెలుపులో బూత్ కమిటీ ఇన్‌చార్జీలదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సోషల్ మీడియాలో వైరల్ చేయాలని సూచించారు. నకిరేకల్ పట్టణంలో నకిరేకల్, కేతెపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట బూత్ కమిటీ, సోషల్ మీడియా ఇన్‌చార్జులతో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఓటర్లను నిత్యం కలుస్తూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో బ్రహ్మాండంగా ఉందని, గడపగడపకూ వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలన్నారు. సీఎం కేసీఆర్‌కు అండగా ఉండి తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. రాబోయే 28రోజులు కీలకంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, చింతల సోమన్న, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ క్రిశాంక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు రాచకొండ శ్రీనివాస్ గౌడ్, కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, సైదులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, ఏడుకొండలు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు ప్రభాకర్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నియోజకవర్గ బీఆర్ఎస్ బూత్ ఇన్‌చార్జీలు

# నల్లగొండలో ఉర్సు షురూ

- వేర్వేరుగా గంధోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎస్పీ
- అలరించిన పకీర్ల, ముస్లిం యువత విన్యాసాలు


మదీన మసిద్‌లో గంధం ఎత్తుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి

రామగిరి, నవంబర్ 2 : నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో గల 'హజరత్ సయ్యద్ లతీఫ్ షా వలీ' దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గడియారం సెంటర్‌లో గల మదీనా మసీద్‌లో అసర్ నమాజ్ తర్వాత రాత్రి గంధం ఊరేగింపు ప్రారంభమైంది. గంధంలో ఊరేగింపులో పకీర్లు, ముస్లిం యువత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రాంతాల్లో ఊరేగింపు తర్వాత రాత్రికి గంధం దర్గా మెట్ల వద్దకు రాగా దర్గా ముతవల్లు, ముస్లిం పెద్దలు స్వీకరించి గుట్టపైకి తీసుకెళ్లారు. ఈ నెల 4న ఖవ్వాలితో అధికారికంగా ఉర్సు ముగుస్తున్నప్పటికీ సుమారు నెలకుపైగా సందడిగా ఉర్సు వేడుకలు సాగుతాయి. దర్గా మెట్ల వద్ద, సమీపంలో దుకాణాలు వెలియడంతో ఆధ్యాత్మిక సందడితో మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు దర్శనమిచ్చింది. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి హాజరై గంధం ఎత్తుకుని ప్రారంభించారు. మదీనా మసీదులో తొలుత పోలీసుల తరపున ఎస్పీ అపూర్వరావు, అదనపు ఎస్పీ హనుమంతరావు, సీఐలు స్వయంగా గంధం ఎత్తుకుని దర్గా ముతవల్లులు, ముస్లిం పెద్దలతో ప్రారంభించి ముందుకు సాగారు. వేడుకల్లో ముస్లిం సోదరులు, పకీర్లు చేసిన పలు విన్యాసాలు, పాటలు అలరించాయి. గంధం ఊరేగింపులో పోలీసులు ప్రత్యేక బందోబస్తు కొనసాగించారు. వేడకల్లో దర్గా ముతవల్లులు సయ్యద్ రషీద్‌ఖాద్రి సాహెబ్, సమిఉల్లా ఖాద్రీసాహెబ్, సయ్యద్ సల్మాన్ ఖాద్రీ, జామాల్ ఖాద్రి, ఉర్సు ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ జాఫర్, సయ్యద్ హాశం, చాంద్, జాఫర్ పటేల్, హసతుల్లా బేగ్‌సాహెబ్, సీఐలు పీఎన్‌డీ.దుర్గాప్రసాద్, ఆదిరెడ్డి, కొండల్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్ఐలు, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


గంధం ఊరేగింపు


దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లో సంక్షేమం జీరో

- సబ్బండ జాతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- పెన్‌పహాడ్‌లో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

పెన్‌పహాడ్, నవంబర్ 2 : దేశంలో డబుల్ ఇంజిన్ పాలన చేస్తున్న బీజేపీ రాష్ట్రాల్లో కంటే ఎన్నో రెట్లుగా ఎక్కువగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ జాతులకు సమన్యాయం చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులకు కేవలం రూ.600 ఇస్తుంటే తెలంగాణలో రూ.4వేలు ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి ఓట్ల కోసం వచ్చే వారిని నమ్మవద్దని సూచించారు. ఓటు అడిగే హక్కు ప్రతి పక్షాలకు లేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ 60యేండ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడు గెలిస్తే ఏం చేస్తాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంతాన్ని పారాయి పాలనలో పెట్టి వారి మోచేతి నీరు తాగిన నేతలకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హాట్రిక్ విజయం ఖాయమన్నారు. ఈ సందర్భగా దూపాడ్, లింగాల గ్రామాల్లోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన వార్డు మెంబర్లు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆ పార్టీలకు రాజీనామా చేసి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు మండలంలోని దోసపహాడ్‌లో గుండెపోటుతో మృతిచెందిన బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకుడు సద్దల యాదగిరి మృతదేహాన్ని మంత్రి సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంట్టెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ నహీం, నాయకులు పేర్ల సోమయ్య, గార్లపాటి వెంకట్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నర్సయ్య, పరంధాములు, రాధాకృష్ణ, శ్రీనివాస్, బిట్టు నాగేశ్వర్‌రావు, మామిడి వెంకన్న, పరెడ్డి సీతారాంరెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, నెమ్మాది క్రిష్ణ, ఒగ్గు గోపి, రఫీ, మస్తాన్, దివ్యాంగులు పాల్గొన్నారు.


డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గంపూడి నారాయణరెడ్డి

# డీసీఎంఎస్ చైర్మన్‌గా నారాయణరెడ్డి

- వట్టె జానయ్య అర్హత కోల్పోవడంతో వైస్ చైర్మన్‌కు అవకాశం
- డీసీఓ ఆదేశాలతో బాధ్యతల స్వీకరణ

నల్లగొండ / దామరచర్ల, నవంబర్ 2 : డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య ఆ పదవికి అర్హత కోల్పోవడడంతో ఆయన స్థానంలో దామరచర్ల పీఏసీఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి నియామకమయ్యారు. ప్రస్తుతం డీసీఎంఎస్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నారాయణరెడ్డి డీసీఓ ఆదేశాలతో గురువారం స్థానిక కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. జానయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట పీఏసీఎస్ పాలక వర్గం రద్దుతో ఉమ్మడి జిల్లా డీసీఎంస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జానయ్యను కో ఆపరేటివ్ చట్టం ప్రకారం అనర్హుడిగా తేల్చారు. ఉమ్మడి జిల్లా నాగార్జున సహకార మార్కెటింగ్ సొసైటీ పాలకవర్గం 13మందితో ఉండగా దీనికి వట్టె జానయ్య చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సహకార చట్టం 1964 సెక్షన్ 13ఏ ప్రకారం ప్రతి సొసైటీ ఏడాదిలో రెండు సార్లు సమావేశం నిర్వహించాలి. అయితే సూర్యాపేట పీఏసీఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జానయ్య ఈ ఏడాది మార్చి నుండి సెప్టెంబర్ నాటికి నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహించలేదు. దాంతో సూర్యాపేట డీసీఓ శ్రీధర్ ఇటీవల చైర్మన్‌తో పాటు ఆ పాలక వర్గంలో ఉన్న 13మంది సభ్యులను వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. గడువు లోపల వారి నుండి ఎలాంటి వివరణ రాకపోవడంతో పాలకవర్గం రద్దయినట్లు తెలిపారు. సూర్యాపేట పీఏసీఎస్ రద్దు తర్వాత అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ నల్లగొండలో డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో నల్లగొండ డీఔ రేపాల కిరణ్ కుమార్ అక్టోబర్ 1వ తేదీన నోటీసులు పంపారు. సూర్యాపేట పీఏసీఎస్ రద్దు అయినందున మీరు నల్లగొండ డీసీఎంస్ చైర్మన్‌కు అనర్హులని దీనికి మీ దగ్గర ఏమైనా సంజాయిషీ ఉంటే ఇవ్వాలని నోటీసు పంపారు. దీనికి జానయ్యతో పాటు పాలక వర్గంలో ఉన్న 13మంది సభ్యుల నుంచి ఎలాంటి సంజాయిషీ రాకపోవడంతో సొసైటీనీ రద్దు చేసి ఆయన స్థానంలో సహకార చట్టం 1964 సెక్షన్ 21ఏ ప్రకారం వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డికి చైర్మన్ బాధ్యతలు ఇచ్చినట్లు డీసీఓ కిరణ్ కుమార్ తెలిపారు. దాంతో నారాయణరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించగా ఆయనకు మేనేజర్ మురళి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.